క్లుప్తంగా

ఉదయభానును కలిసిన ఎంపీడీవో



జగ్గయ్యపేట అర్బన్: పెనుగంచిప్రోలు ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముంజి శ్రీహర్షసాయి శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఉదయభానుకు పుష్పగుచ్ఛాన్ని అందజేయగా, ఎంపీడీవో శ్రీహర్షసాయికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీవోగా సమర్థవంతంగా పనిచేస్తూ మండల ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.

మిరప పంటల పరిశీలన



నందిగామ: మిరప పంటలను సాగు చేసే రైతులు తెగుళ్ల నివారణకు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదిస్తూ వారి సూచనలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారిణి నీలిమ సూచించారు. మండలంలోని రామిరెడ్డిపల్లి పరిసర ప్రాంతాల్లో సాగవుతున్న మిరప పంటలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ఉద్యానవనశాఖ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

231 మందికి వైద్యపరీక్షలు



నందిగామ: పట్టణంలోని గాంధీ సెంటర్‌లో స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి 231మంది హాజరుకాగా, వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆసుపత్రి ప్రతినిధి సుధాకర్ తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఓటర్ల జాబితాపై బీఎల్వోలతో సమీక్ష



నందిగామ: ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ప్రతిఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని ఆర్డీఓ పి.సాయిబాబు సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమావేశం మందిరంలో శనివారం బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటరు జాబితాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా జీరో డోర్ నంబర్లకు సంబంధించిన ఓట్లతోపాటు ఒకే డోర్ నంబరుపై పది కంటే ఎక్కువ ఓట్లు ఉన్నట్లయితే అటువంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సమావేశంలో నందిగామ మండల తహశీల్దార్ నరసింహారావు, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొణకంచిలో అభివృద్ధి పరుగులు

- రూ.3కోట్లతో పనులు..
- నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- తీరిన మంచినీటి సమస్య
- రూ.45లక్షలతో సచివాలయం



కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న కొణకంచి ప్రాథమిక పాఠశాల భవనాలు, ఆవరణ

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్వాతంత్రోద్యమ కాలంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన కొణకంచి గ్రామాభివృద్ధికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో రూ.3కోట్ల నిధులు కేటాయించడంతో గ్రామంలో నెలకొన్న ఆయా సమస్యలు పరిష్కారమయ్యాయి. మౌలికవసతులు మెరుగపడగా, గ్రామం అభివృద్ధిపథంలో దూసుకువెళ్తోంది.

రూ.62లక్షలతో పాఠశాలల అభివృద్ధి..

నాడు–నేడు పథకం కింద కొణకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రూ.41లక్షలతో, ప్రాథమిక పాఠశాలను రూ.21లక్షలతో అభివృద్ధి చేశారు. పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టి, విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆధునిక వసతులు కల్పించారు. దీంతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. రూ.45 లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయ భవనం నిర్మాణం కూడా పూర్తి కావచ్చింది. ఈ భవనాన్ని త్వరలో ప్రారంభించేందుకు స్థానిక నాయకులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



తుదిదశలో ఉన్న సచివాలయ భవనం పనులు

రూ.1.20కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలు..

గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వేదాద్రి వద్ద కృష్ణానది నుంచి రూ.53లక్షలతో గ్రామానికి పైపులైన్ ఏర్పాటు చేయించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. అలాగే రూ.60లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, రూ.60లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. రూ.11లక్షలతో వ్యవసాయ సొసైటీ భవనాన్ని ఆధునీకరించారు. రూ.6లక్షలతో పురాతనమైన ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామంలో సొంతిల్లులేని 65మంది పేదలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో వారు ఇళ్లను నిర్మించుకుంటున్నారు.



ఆధునీకరించిన సొసైటీ భవనం

ఊహించని అభివృద్ధి..



నేను సర్పంచ్‌గా పనిచేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామంలో కోట్లాది రూపాయిల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేయడం సంతోషంగా ఉంది. పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– గోనెల దేవి, సర్పంచ్

మంచినీటి సమస్య తీరింది..



శివారు గ్రామంగా ఉండటంతో కొళ్లికూళ్ల స్కీమ్ నుంచి తాగునీరు సరిగా అందక ఇబ్బందులు పడేవాళ్లం. ప్రజల ఇబ్బందులను ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకెళ్లడంతో పైపులైన్ నిర్మాణానికి రూ.53లక్షలు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తిచేయించారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. త్వరలోనే ఈ సమస్య కూడా తీరనుంది.

– కనగాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ

జగనన్నతోనే సమగ్రాభివృద్ధి

ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్

పెండ్యాల(కంచికచర్ల) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని పెండ్యాలలో శనివారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ అమలుచేస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా సచివాలయ అధికారులు, వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు పింఛన్లతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రంలో కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో పెండ్యాల–2 సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు నవరత్నాల ద్వారా రూ.22.84కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు వివరించారు. టీడీపీ నాయకుల్లా మాయమాటలు చెప్పే అలవాటు తమకు లేదని, మాట ఇచ్చామంటే ఖచ్చితంగా ఎంత కష్టమైనా ఆ మాటను నిలబెట్టుకుంటామని వివరించారు. మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలని, రానున్న ఎన్నికల్లో నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావును మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, షేక్ పీర్‌సామియా, మాజీ సర్పంచి షేక్ ఖాజాపాషా, షేక్ చాన్‌బహదూర్, చింతా రవీంద్రనాథ్, రాయల నరసింహారావు, ఫయాంబాషా, గౌస్ పాల్గొన్నారు.



పెండ్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్

చట్టాలపై అవగాహన అవసరం

నందిగామ: ప్రతిఒక్కరూ రాజ్యాంగం, చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు సూచించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదుల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలు, హక్కుల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి వి.లక్ష్మీరాజ్యం, అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు, న్యాయవాదులు భాస్కరరావు, మట్టా ప్రసాద్, ఈశ్వరప్రగడ రంగారావు, షేక్ ఆజాద్, బొందలపాటి రామకృష్ణ, మన్నెం నారాయణరావు, షేక్ దాదా హుస్సేన్, కొమ్మినేని మహేశ్వరరావు, ఎర్రంరెడ్డి బాబురావు, టీవీ శర్మ, షేక్ కరీముల్లా, ఎక్కిరాల హనుమంతరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



నందిగామలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

ఆలయాల్లో శని త్రయోదశి పూజలు

నందిగామ : డివిజన్ వ్యాప్తంగా శైవక్షేత్రాల్లోని నవగ్రహ మండపాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. త్రయోదశి, శనివారం కలిసి రావడంతో శనీశ్వరునికి పూజలు నిర్వహిస్తే, సకల దోషాలు తొలగిపోతాయంటూ పెద్దసంఖ్యలో భక్తులు నవగ్రహ మండపాలకు తరలివచ్చి పూజలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని నవగ్రహ మండపంలో తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు శనికి తైలాభిషేకం కొనసాగింది.రామలింగేశ్వరనగర్‌లోని అయ్యప్ప ఆలయం, గాంధీనగర్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, పల్లగిరి గట్టుపై గల నవగ్రహ మండపాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని శనికి తైలాభిషకం చేశారు. ని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంతోపాటు ఆయా గ్రామాల్లోని శివాలయాల్లోగల నవగ్రహ మండపాల్లో శనికి తైలాభిషేకాలు జరిగాయి.అనంతరం శివాలయాల్లో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు.



శనీశ్వరునికి తైలాభిషేకం చేస్తున్న అర్చకులు



రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

స్కూల్ బస్సులో మంటలు

డ్రైవర్‌కు స్వల్పగాయాలు

జగ్గయ్యపేట: స్కూలు బస్సులో మంటలు వ్యాపించడంతో డ్రైవర్ స్వలంగా గాయపడిన ఘటన శనివారం జగ్గయ్యపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు మండలంలోని బలుసుపాడు నుంచి విద్యార్థులతో ఉదయం 7.30గంటలకు జగ్గయ్య పేట బయలుదేరింది. ఈ క్రమంలో ఇండేన్ గ్యాస్ సెంటర్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా బస్సు ఇంజిన్‌లో నుంచి పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. వెంటనే బస్సులో ఉన్న 35మంది విద్యార్థులను కిందకు దింపాడు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి బస్సులో నుంచి వస్తున్న మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదఘటన సమాచారాన్ని తెలుసుకున్న జగ్గయ్యపేట ఎస్ఐ రామారావు, రవాణాశాఖాధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బస్సును పరిశీలించారు. ఇంజిన్‌లో సాంకేతికలోపం కారణంగా బస్సులో మంటలు వచ్చినట్లు నిర్ధారించారు. సకాలంలో ప్రమాదాన్ని గుర్తించడంతో విద్యార్థులకు పెద్దప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



బస్సులో నుంచి వస్తున్న మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్న స్థానికులు

సంక్షేమ హాస్టళ్ల పరిశీలన

నందిగామ: మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం శనివారం పట్టణంలోని 13వ వార్డులో పర్యటించారు. వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతోపాటు దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులోని పలు సంక్షేమ హాస్టళ్లను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ గద్దె రమేష్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం, నగదు అక్రమరవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే అనుమతిస్తున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు తగిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని స్థానిక స్మైల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ త్రిలోక్ సూచించారు. పట్టణంలోని శ్రీవివాన్ గ్లోబల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కీర్తి ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పోషకాహార అవగాహన కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా డాక్టర్ త్రిలోక్ పోషకాహారం ప్రాముఖ్యత, విటమిన్ల ఆవశ్యకతను వివరించారు. పోషకాహారం తీసుకోకుంటే కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. పోషకాలతో కూడిన ఆహారం విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంచె తిరిగిన చేయి



వెంకటేశ్వరావు గీసిన చిత్రం



చిత్రాలు గీస్తున్న వెంకటేశ్వరరావు

చిత్రలేఖనంలో అద్భుతాలు సృష్టిస్తున్న వెంకటేశ్వరావు

నందిగామ: ఒక చిత్రం ఎన్నో సందేశాలను ఇస్తుంది...ఎన్నో అద్భుతాలను సృష్టిస్తుంది. ఏ భాష చెప్పలేని భావాన్ని ఒక చిత్రం చెప్పగలదు. అందుకే చిత్రలేఖనానికి అంతటి ప్రత్యేకత. ఒక చిత్రానికి రూపం రావాలంటే చిత్రకారుడు చేసే కృషిని మాటల్లో చెప్పలేము. ఎంతోమంది చిత్రకారులు జీవం ఉట్టిపడేలా చిత్రాలను గీస్తూ తమ కళతో ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. ఆ కోవకు చెందిన వ్యక్తే నందిగామ పట్టణానికి చెందిన కాట్రగడ్డ వెంకటేశ్వరరావు. ఆయన కూడా తన కుంచెతో అద్భుతమైన చిత్రాలను గీస్తూ అందరిని అబ్బురపరుస్తున్నారు.

మనసును హత్తుకునేలా చిత్రాలు..

నందిగామ పట్టణానికి చెందిన వెంకటేశ్వరరావుకు చిన్నతనం నుంచి చిత్రలేఖనం అంటే ఇష్టం. పాఠశాలలో ఎప్పుడు డ్రాయింగ్ పోటీలు జరిగినా ఆ పోటీల్లో వెంకటేశ్వరరావుయే మొదటి స్థానంలో నిలిచేవారు. ఈ తరుణంలో అనేక పాఠశాలల స్థాయిల్లో కూడా మొదటిస్థానంలో నిలిచారు. అయితే చదువు పూర్తయిన తర్వాత పరిస్థితులు అనుకూలించక ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా కొనసాగుతున్నారు. ఎంఏ వరకు చదువుకున్న వెంకటేశ్వరరావు చిత్రలేఖనంపై ఉన్న మక్కువతో ఇప్పటికీ ప్రతిరోజూ ఖాళీగా ఉన్న సమయంలో ఎన్నో చిత్రాలు గీస్తుంటారు. ముఖ్యంగా దేవతా మూర్తుల ఫోటోలతోపాటు అనేకరకాల చిత్రాలను మనసును ఆకట్టుకునేలా గీశారు. ఆయన గీసిన ప్రతి చిత్రం జీవం ఉట్టిపడేలా ఉంటుంది. ప్రకృతి రమణీయత కళ్లకు కట్టినట్లుగా గీయడంలో వెంకటేశ్వరరావుది కుంచె తిరిగిన చేయి అని చెప్పవచ్చు. ఆయన చూసిన సన్నివేశం కంటికి నచ్చితే చాలు వెంటనే ఆ చిత్రాన్ని గీసేస్తాడు. ఊహ చిత్రాలతోపాటు ఎన్నో రకాల కాన్వాస్ పెయింటింగ్స్ గీశారు. ఇప్పటికే తను గీసిన వందలాది చిత్రాలు విదేశాలకు కూడా వెళ్లాయని వెంకటేశ్వరరావు చెప్పారు.

చిత్రలేఖనం నా హాబి..



చిత్రలేఖనం అంటే నాకు ఎంతో మక్కువ. వృత్తి రీత్యా ఓ ప్రైవేట్ కంపెనీలో స్టోర్స్ మేనేజర్‌గా చేస్తున్నాను. ఖాళీ సమయంలో నాకు నచ్చిన చిత్రాలను గీస్తుంటాను. ఇలా చిత్రాలు గీస్తుండటం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది.

కాట్రగడ్డ వెంకటేశ్వరరావు

దాసుకి ఘననివాళి



కంచికచర్ల : స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అమర్లపూడి దాసు ఆదరణ కూడిక శనివారం జరిగింది. ఈ కూడికలో నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీలు మొండితోక అరుణకుమార్, జూపూడి ప్రభాకరరావు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అమర్లపూడి శేఖర్, దేవినేని అవినాష్ తదితరులు పాల్గొని దాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దాసు కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, కంచికచర్ల, వీరులపాడు జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్ బాబు, నాయకులు అమర్లపూడి యోహాన్, వేల్పుల శ్రీనివాసరావు, మేడిద బాబూరావు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు ఈ నెల 29, 30 తేదీల్లో కేఎల్ యూనివర్సిటీలో జరుగుతాయని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ శనివారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఏడు ప్రాజెక్టులతో పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఇవి జాతీయస్థాయికి ఎంపికవ్వడానికి లాగ్ బుక్ ప్రాజెక్టు ఎలా డెవలప్ చేయాలనే అంశం పై శనివారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు ఆయన శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు ప్రయోగాల్లో నూతన ఆలోచనలు ఉండే విధంగా ప్రజెంటేషన్ ఉండాలని సూచించారు.

విద్యార్థులకు ప్రాజెక్టు కిట్లు అందజేత



నందిగామ: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు యునైటెడ్ స్టేట్స్ ఫెడరల్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నాసా నిర్వహించే ప్రాజెక్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన ప్రాజెక్ట్ కిట్స్‌ను పట్టణ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ గుప్తా ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానాన్ని వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. ఎస్సై పండు దొర, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశం



జగ్గయ్యపేట అర్బన్ : దోమల నివారణకు పట్టణంలోని అన్నివార్డుల్లో పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య చర్యలు మరింత మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సచివాలయం శానిటరీ సెక్రటరీ రమాదేవి, స్థానిక నాయకుడు పాకలపాటి డేవిడ్ పాల్గొన్నారు.